హెచ్‌పీఎస్ దేశానికి గర్వకారణం

- ప్రపంచానికి నాయకులను అందించిన ఘనత హెచ్‌పీఎస్‌దే: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో శతాబ్ది వేడుకలు



హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థినితో మాట్లాడుతున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 19(నమస్తే తెలంగాణ): వందేండ్ల చరిత్ర కలిగిన హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్) దేశానికి గర్వకారణమని, ఇక్కడ చదువుకున్న ఎందరో అంతర్జాతీయస్థాయిలో సత్తా చాటుతున్నారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ శతాబ్ది ఉత్సవాల ప్రారంభానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముర్ము మాట్లాడుతూ.. ప్రపంచానికి నాయకులను అందించిన ఘనతను హెచ్‌పీఎస్ సొంతం చేసుకున్నదని ప్రశంసించారు. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్యనాదెళ్ల తోపాటు ఎంతోమంది ఇక్కడ చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకున్నారని చెప్పారు. విభిన్నమైన నేపథ్యాల నుంచి వచ్చిన విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, జాతి అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. జాతీయ నూతన విధానానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, భవిష్యత్తులో వచ్చే సవాళ్లను ఎదుర్కొనే మనోస్థైర్యాన్ని అలవరుచుకోవాలని కోరారు. చారిత్రక నేపథ్యం ఉన్న ఇలాంటి పాఠశాలల శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనడం ఆనందంగా ఉన్నదని తెలిపారు. పాఠశాల యాజమాన్యానికి, విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం గవర్నర్ తమిళిసైసౌందర రాజన్ మాట్లాడుతూ.. రాజకీయాల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలుగా, బ్యాంకింగ్ రంగంలో, విద్యా, పారిశ్రామిక రంగాలతోపాటు, అడ్వకేట్లు, సీఏలను తీర్చిదిద్దిన ఘనత ఈ పాఠశాలకు ఉన్నదని పేర్కొన్నారు. ఇక్కడ చదివి సమాజంలో ఉన్న తస్థానంలో నిలిచిన ఎంతోమంది ముందు తాను నిలబడడం గర్వం ఉన్నదని తెలిపారు. విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కాకుండా పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేలా జాతీయ నూతన విద్యా విధానం సాయపడుతుందని వివరించారు. విద్యా సంస్థలకు ఆటలు, చదువులు రెండు కన్నుల లాంటివని, ఇక్కడ విద్యార్థులను అన్ని రంగాల్లో భాగస్వామ్యయ్యేలా ప్రోత్సహించడం అభినందనీయమని కొనియాడారు. శతాబ్ది ఉత్సవాల ప్రారంభోత్సవ వేడుకలకు హాజరైన రాష్ట్రపతికి విద్యార్థులు శాస్త్రీయ నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ సొసైటీ ప్రెసిడెంట్ గుస్తీ నోరియా, హెచ్‌పీఎస్ బోర్డు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి వేడుకలు

వందేండ్ల వారసత్వ వేడుకల్లో భాగంగా ఈ నెల 24 నుంచి 27 వరకు ప్రత్యేక కార్యక్రమాలను పాఠశాల యాజమాన్యం నిర్వహిస్తున్నది. 25న సెంటినరీ గోల్ఫ్ టోర్నమెంట్, వింటేజ్, సూపర్ కార్ల ప్రదర్శన, ఆంత్రప్రెన్యూర్‌షిప్ సమ్మిట్, యూత్ పార్లమెంట్, లైవ్ కన్సర్ట్, వందేండ్ల పాఠశాల మధుర జ్ఞాపకాలను మరో 25ఏండ్ల తర్వాత అందించేలా టైం క్యాప్సూల్, ఫోటో ఎగ్జిబిషన్, అలూమినీ, స్టాఫ్ గ్రాండ్ యూనియన్, ప్రముఖ సింగర్లు శంకర్ ఏశాన్ లాయ్‌తో గ్రాండ్ ఫినాలే మ్యూజిక్ షోతో విద్యారంగంలో వందేండ్ల చరిత్ర స్మృతులను భావితరాలకు అందించేలా నిర్వహించనున్నారు.

- చెట్లను నరకొద్దని బాలుడి వేడుకోలు

సంగారెడ్డి జిల్లా ఆర్సీపురంలోని కాకతీయనగర్ కాలనీలో రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ చెట్లను తొలగిస్తున్నాడు. అయితే.. స్థానికంగా నివాసం ఉండే ప్రవీణ్‌కుమార్ కుమారుడు అనిరుధ్.. ఆ చెట్లను తాను నాటానని, వాటిని నరకొద్దంటూ.. ఏడు గంటలపాటు చెట్టుపై కూర్చొని వేడుకున్నాడు. 12 ఏండ్ల బాలుడికి చెట్ల ప్రాముఖ్యత, ఆక్సిజన్, జీవరాశుల మనుగడ, ప్రకృతిపై అవగాహన ఉండటం నిజంగా అభినందనీయమంటూ పలువురు అనిరుధ్‌ని ప్రశంసిస్తున్నారు. -రామచంద్రాపురం

బావులకు రెట్టింపు కరెంటు బిల్లులు

- రూ.360కి బదులు రూ.720 వసూలు
- లైన్‌మెన్, ఏఈని నిలదీసిన రైతులు
- వచ్చే బిల్లులో సర్దుబాటు చేస్తామని హామీ

నర్మెట, డిసెంబర్ 19 : ఏటా వ్యవసాయ బావుల విద్యుత్తు కనెక్షన్‌కు రూ.360కి బదులు రూ.720 వసూలు చేస్తున్నారంటూ రైతులు విద్యుత్తు అధికారులను నిలదీశారు. ఈ ఘటన జనగామ జిల్లా నర్మెట మండలం వెల్దండ గ్రామంలో మంగళవారం చోటుచేసుకున్నది. గ్రామంలో జూనియర్ లైన్‌మెన్ రాజేందర్ వ్యవసాయానికి విద్యుత్తు సరఫరా నిలిపివేసి పంచాయతీ కార్యాలయ సమీపంలో రైతుల నుంచి బిల్లులు వసూలు చేస్తున్నాడు. విద్యుత్తు సంస్థ నుంచి వచ్చిన జాబితాలో వార్షిక చార్జీలు రూ.360 ఉండగా రూ.720 వసూలు చేయడాన్ని రైతులు నిలదీశారు. పైఅధికారుల ఆదేశాల మేరకు వసూలు చేస్తున్నట్టు ఆయన చెప్పడంతో రైతులు ఆగ్రహంతో ఏఈ నర్సింహకు సమాచారమిచ్చారు. ఏఈ అక్కడికి రావడంతో రైతులు నిలదీశారు. అదనంగా చెల్లించిన మొత్తాన్ని వచ్చే బిల్లుల్లో సర్దుబాటు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. రైతులు నమ్మకపోవడంతో ఏఈ రాతపూర్వకంగా రాసిచ్చారు.

ప్రత్యేక రైళ్లతో ప్రయోజనం సున్నా

చార్జీలు, ప్రయాణ సమయం రెండూ ఎక్కువే

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): శబరిమలకు రైల్వే శాఖ ప్రారంభించిన ప్రత్యేక రైళ్లతో ఎటువంటి ప్రయోజనం లేదని అయ్యప్ప భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ రైళ్లలో టికెట్ ధర ఎక్కువ కాగా, ప్రయాణ సమయం కూడా ఎక్కువేనని వాపోతున్నారు. ప్రతి ఏడాది తెలుగు రాష్ట్రాల నుంచి శబరిమలకు వెళ్లే భక్తుల సంఖ్య పెరుగుతున్నది. కానీ ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా రైల్వే శాఖ సదుపాయాలు కల్పించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది దేశవ్యాప్తంగా శబరిమలకు 40 ప్రత్యేక రైళ్లను ప్రారంభించినట్టు రైల్వే శాఖ ప్రకటించింది. ఈ రైళ్లలో సాధారణ చార్జీల కన్నా 50 శాతం అదనంగా వసూలు చేస్తున్నారు. పైగా సాధారణ రైలు 25 గంటల్లో శబరిమలకు చేరుకుంటుండగా, ఈ ప్రత్యేక రైళ్లకు మాత్రం 35 గంటలు పడుతున్నదని శబరిమల వెళ్లి వచ్చిన భక్తులు తెలిపారు. భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రత్యేక రైళ్ల చార్జీలను తగ్గించాలని, ప్రయాణ సమయాన్ని కూడా కుదించాలని వారు కోరుతున్నారు.

ఏసీబీ డీజీగా ఆనంద్

ఎస్ఐబీ డీఐజీగా సుమతి ● డీజీపీగా రవిగుప్తాకు పూర్తి బాధ్యత

అంజనీకుమార్ | రాజీవ్ రతన్ | అభిలాష బిస్ట్ | సౌమ్య మిశ్రా | శిఖాగోయెల్ | ఎం శ్రీనివాసులు | శరత్‌చంద్ర

- రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్‌గా అంజనీకుమార్
- జైళ్ల శాఖ డీజీగా సౌమ్యమిశ్రా
- 20 మంది ఐపీఎస్‌ల బదిలీ

మహేశ్ భగవత్ | అనిల్‌కుమార్ | స్టీఫెన్ రవీంద్ర | తరుణ్ జోషి | కమలాసన్‌రెడ్డి | ఏఆర్ శ్రీనివాస్ | చంద్రశేఖర్‌రెడ్డి | రమేశ్ | రమేశ్‌నాయుడు | సత్యనారాయణ

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో 20 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం పలు శాఖలకు బదిలీ చేసింది. వెయిటింగ్‌లో ఉన్నవారికి పోస్టింగ్ ఇస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఎన్నికల ఫలితాల వేళ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు డీజీపీగా బాధ్యతలు చేపట్టిన రవిగుప్తాకు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. దీంతో పాటు 14మంది ఐపీఎస్‌లకు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఎన్నికల ఫలితాల వరకు డీజీపీగా కొనసాగిన అంజనీకుమార్‌ను రోడ్డు భద్రత విభాగానికి చైర్మన్‌గా నియమించింది. అదనంగా ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కమిషనర్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించింది. కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా బదిలీ అయిన పలువురు ఐపీఎస్‌లకు ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది.

14 మంది ఐపీఎస్‌లకు పదోన్నతులు

తెలంగాణలో 2015 బ్యాచ్‌కు చెందిన 14 మంది ఐపీఎస్‌లకు పదోన్నతి కల్పిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ స్థానాల్లో విధులు నిర్వర్తిస్తున్న 14 మందికి జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ గ్రేడ్ స్కేల్ ఐపీఎస్‌లుగా పదోన్నతి కల్పించింది. ఈ పదోన్నతి ఉత్తర్వులు 2024 జనవరి 1నుంచి అమల్లోకి రానున్నాయి. ప్రమోషన్ పొందిన వారిలో రమేలా సత్పతి, అనురాగ్ జయంతి, గౌతమ్ పోట్రు, రాహుల్ రాజ్, భావేశ్ మిశ్రా, సత్యశారదాదేవి, నారాయణరెడ్డి, ఎస్ హరీశ్, జీ రవి, కే నిఖిల, ఆయేషా మష్రత్ ఖానమ్, సంగీత సత్యనారాయణ, యాసిన్ బాషా, వెంకట్రావ్ ఉన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీలుగా శేషాద్రి, రిజ్వీలకు ప్రభుత్వం పదోన్నతి కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఐఏఎస్ అధికారి ఏ శ్రీదేవసేనకు సెక్రటరీగా సూపర్ టైమ్ స్కేల్ (లెవల్-14 పే మ్యాట్రిక్స్) పదోన్నతి కల్పించింది. అలాగే 2011 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన పాటిల్ ప్రశాంత్ జీవన్, కిల్లు శివకుమార్ నాయుడులకు సెలెక్షన్ గ్రేట్ (లెవల్ -13 పే మ్యాట్రిక్స్) పదోన్నతి కల్పించింది.

ఐపీఎస్ పేరు	ప్రస్తుత పోస్టింగ్	బదిలీ స్థానం
అంజనీకుమార్	వెయిటింగ్	రోడ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్, ప్రింటింగ్ అండ్ స్టేషనరీ
రాజీవ్ రతన్	పోలీస్ హౌసింగ్‌కార్పొరేషన్ ఎండీ	విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్
సీవీ ఆనంద్	వెయిటింగ్	ఏసీబీ డీజీ
అభిలాష బిస్ట్	వెల్ఫేర్ అండ్ స్పోర్ట్స్ & హోంగార్డ్స్ డీజీ	పోలీస్ అకాడమీ డైరెక్టర్, అదనంగా ఐజీ ట్రైనింగ్ బాధ్యతలు
సౌమ్య మిశ్రా	పర్సనల్ డీజీ	జైళ్ల శాఖ డీజీ
శిఖాగోయెల్	ఉమెన్ సేఫ్టీ వింగ్	సీఐడీ డీజీ, అదనంగా సైబర్ సెక్యూరిటీ, టెక్నికల్ సర్వీసెస్
మహేశ్ భగవత్	సీఐడీ	రైల్వేస్ & రోడ్ సేఫ్టీ, అదనంగా ఆర్గనైజేషన్ అండ్ లీగల్
అనిల్‌కుమార్	వెయిటింగ్	తెలంగాణ స్పెషల్ ఫోర్స్ డీజీ
ఎం స్టీఫెన్ రవీంద్ర	వెయిటింగ్	హోంగార్డ్స్ & ఐజీపీ, అదనంగా స్పోర్ట్స్ అండ్ వెల్ఫేర్
తరుణ్ జోషి	అడిషన్ కమిషనర్ రాచకొండ	మల్టీజోన్-2 ఐజీ, అదనంగా మల్టీజోన్-1 ఐజీ బాధ్యతలు
వీబీ కమలాసన్‌రెడ్డి	డ్రగ్స్ కంట్రోల్	ప్రోహిబిషన్ అండ్ అక్సైజ్ డైరెక్టర్
ఏఆర్ శ్రీనివాస్	తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్	ఏసీబీ డైరెక్టర్
ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి	మల్టీజోన్-1 ఐజీ	పర్సనల్ ఐజీ
ఎం రమేశ్	ప్రొవిజనింగ్ అండ్ లాజిస్టిక్స్	పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ
కే రమేశ్‌నాయుడు	డీఐజీ మల్టీజోన్-3 రాజన్న సిరిసిల్ల	సీఐడీ డీఐజీ
వీ సత్యనారాయణ	వెయిటింగ్	జేసీ, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్
ఎం శ్రీనివాసులు	సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్	(రిపోర్టింగ్ టు డీజీపీ ఆఫీస్)
బీ సుమతి	డీఐజీ, సీఐడీ ఉమెన్ సేఫ్టీ వింగ్	ఎస్ఐబీ డీఐజీ
శరత్‌చంద్ర పవార్	పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్	హైదరాబాద్ సెంట్రల్ జోన్ డీసీపీ

13 జిల్లాల స్పౌజ్ బదిలీలు చేపట్టండి

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): ఉద్యోగుల కేటాయింపులో భాగంగా మిగిలిన 13 జిల్లాల స్పౌజ్ బదిలీలు వెంటనే చేపట్టాలని స్పౌజ్ బాధితులు మంగళవారం ప్రజావాణిలో వినతిపత్రాలు సమర్పించారు. మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, సీతక్క, దామోదర్ రాజనర్సింహను కలిసి వారు వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో మమత, త్రివేణి, సౌజన్య, నరేశ్, వివేక్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏజీ జీపీఎఫ్ అవకాశం కల్పించండి: టీఎస్‌జీ హెచ్ఎం

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): జిల్లా మారిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు ఏజీ జీపీఎఫ్ అవకాశం కల్పించాలని గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కను కలిసిన అసోసియేషన్ రాష్ట్ర, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీ రాజభాను చంద్రప్రకాశ్, ఆర్ రాజుగంగారెడ్డి వినతిపత్రాన్ని సమర్పించారు. బడి బ్యాగు బరువును తగ్గించాలని, పదో తరగతి పరీక్షలు సహా వివిధ అంశాలపై వేర్వేరుగా వారు వినతిపత్రాలను సమర్పించారు.

కేయూ గర్ల్స్‌హాస్టల్‌లో ర్యాగింగ్

- తీవ్రస్థాయిలో హెచ్చరించిన అధికారులు

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 19: కాకతీయ యూనివర్సిటీలోని గర్ల్స్ హాస్టల్‌లో సీనియర్ విద్యార్థినులు జూనియర్లను ర్యాగింగ్ చేశారు. జూనియర్ల ఫిర్యాదు మేరకు అధికారులు సీనియర్లను తీవ్రస్థాయిలో హెచ్చరించారు. అధికారులు ర్యాగింగ్‌పై అవగాహన కల్పించకపోవడంతోనే స్నేహపూరిత వాతావరణంలో ఉండాల్సిన విద్యార్థినులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శలొస్తున్నాయి. ఈ విషయంపై కేయూ హాస్టల్ డైరెక్టర్ వెంకయ్యను వివరణ కోరగా.. సీనియర్లు పరిచయాల పేరిట ర్యాగింగ్ చేసినట్టు కొత్తగా హాస్టల్‌కు వచ్చిన విద్యార్థినులు తెలిపారని వెల్డించారు. దీంతో సీనియర్ విద్యార్థినులను హెచ్చరించి జూనియర్లకు క్షమాపణ చెప్పించినట్టు తెలిపారు.

స్వామివారి పరదాలతో ఆలయ ధ్వజస్తంభం వద్ద టీటీడీ అధికారులు, స్వామీజీలు

తిరుమలలో వైభవంగా
కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): వైకుంఠ ఏకాదశి (డిసెంబర్ 23న) పర్వదినం సందర్భంగా మంగళవారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని ఘనంగా నిర్వహించారు. ఏటా నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఉగాది, ఆణివార అస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మంగళవారం ఉదయం 6 నుంచి ఉదయం 10 గంటల వరకు నిర్వహించిన శుద్ధి కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూమన మాట్లాడుతూ.. శతాబ్దాల నాటి ఆలయశుద్ధి, కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనందంగా ఉన్నదని పేర్కొన్నారు. తిరుమంజనం సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి 10:30 గంటల వరకు అష్టదశ పాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది.

పోలీస్ కస్టడీకి తాంత్రికుడు సత్యంయాదవ్

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 19: గుప్తనిధుల ఆశచూపి, మంత్రాలు, క్షుద్ర పూజల పేరుతో 11 మందిని హత్య చేసి సంచలనం రేపిన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన తాంత్రికుడు సత్యంయాదవ్‌ను మంగళవారం పోలీస్ కస్టడీకి తీసుకున్నట్టు సమాచారం. సీరియల్ కిల్లర్‌గా ఉంటూ హత్యలు చేస్తున్న సత్యంయాదవ్‌ను వారం కిందట అదుపులోకి తీసుకొని జైలుకు పంపిన విషయం తెలిసిందే. అయితే.. సత్యంయాదవ్‌ను ఇప్పటికే విచారించగా.. పలు కొత్త విషయాలు వెలుగచూశాయి. దీంతో మరో రెండు రోజులపాటు విచారించి మరిన్ని విషయాలు రాబట్టేందుకు పోలీసులు కస్టడీకి తీసుకున్నట్టు తెలుస్తున్నది.

జూన్ 16ను జిన్‌పింగ్ ఎప్పటికీ మర్చిపోరు

గల్వాన్ ఘటనపై ఆర్మీ మాజీ చీఫ్ నరవణే

న్యూఢిల్లీ: చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ జూన్ 16ను అంత త్వరగా మర్చిపోబోరని భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ మనోజ్ ముకుంద్ నరవణే అన్నారు. నేపాల్ వంటి చిన్న దేశాలను బెదిరించి, లొంగదీసుకునే చైనాకు గల్వాన్ లోయలో ఆ రోజు భారత సైన్యం గట్టిగా బుద్ధి చెప్పిందన్నారు. పొరుగు దేశం వేధింపులను సవాల్ చేయడాన్ని ప్రపంచానికి చూపించే అవకాశం భారత సైన్యానికి వచ్చిందని తెలిపారు. తూర్పు లఢక్‌లో 2020 జూన్‌లో భారత్, చైనా సైన్యాల మధ్య ఘర్షణ జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘర్షణలో 20 మంది భారత సైనికులు అమరులు కాగా, చైనా సైన్యానికి జరిగిన నష్టాన్ని ఆ దేశం స్పష్టంగా చెప్పలేదు. జనరల్ నరవణే తన జీవిత కథను 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పేరుతో రాశారు. ఇది వచ్చే నెలలో ప్రజలకు అందుబాటులోకి రాబోతున్నది. గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణలో 20 మంది భారత సైనికులు అమరులు కావడం తన జీవితంలో అత్యంత విచారకరమైన రోజులని నరవణే ఆవేదన వ్యక్తం చేశారు. జిన్‌పింగ్ పుట్టిన రోజు కూడా జూన్ 16నే అని, ఆ రోజును ఆయన తొందరగా మర్చిపోబోరని అన్నారు. గత రెండు దశాబ్దాల్లో చైనీయులు, పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ దారుణంగా ప్రాణాలను కోల్పోవడం అదే మొదటిసారి అని చెప్పారు.

డీఆర్‌డీఎల్ ఇండస్ట్రీ
పార్ట్‌నర్స్ మీట్

హైదరాబాద్, డిసెంబర్ 19(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ లోని డిఫెన్స్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ లేబరేటరీ (డీఆర్‌డీఎల్)లో మంగళవారం డీఆర్‌డీఎల్ ఇండస్ట్రీ పార్ట్‌నర్స్, అసోసియేట్స్ మీట్-2023 నిర్వహించారు. దీనిని డీఆర్‌డీఎల్ డైరెక్టర్ జీఏ శ్రీనివాసమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా డీఆర్‌డీఎల్‌తో వ్యాపారానికి ఉన్న అవకాశాల గురించి నిర్వాహకులు వివరించారు. కార్యక్రమంలో 150 మంది వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

టెక్నాలజీతో కాలుష్యాన్ని
నియంత్రించాలి

- పాతటైర్ల నుంచి నూనె తీసే పరిశ్రమలపై అధిక ఫిర్యాదులు
- రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యకార్యదర్శి కృష్ణ త్రివేది

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): పాతటైర్ల నుంచి నూనె తీసే పరిశ్రమల యజమానులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కాలుష్యాన్ని నియంత్రించాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి కృష్ణ త్రివేది సూచించారు. ఆ ఫ్యాక్టరీలు పర్యావరణ మార్గదర్శకాలను విధిగా పాటించాలని ఆదేశించారు. పర్యావరణ కాలుష్యానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాతటైర్ల నుంచి నూనె తీసే పరిశ్రమల్లో పాటించాల్సిన సాంకేతిక పరిజ్ఞానంపై మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో చర్చించారు. రాష్ట్రంలో పాతటైర్ల నుంచి నూనె తీసే పరిశ్రమలు 47 ఉన్నాయని, వీటిలో 24 సంగారెడ్డి, 9 నల్లగొండ జిల్లాల్లో ఉన్నట్టు చెప్పారు. వీటిపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నందున కొన్ని మార్గదర్శకాలను జారీ చేసినట్టు తెలిపారు. సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్లు జవహర్‌లాల్, ప్రసన్నరాణి, నరేందర్‌తోపాటు 47 మంది పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

బేగంపేట హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వద్ద మంగళవారం మహిళలు ఎక్కక ముందే వెళ్లిపోతున్న ఆర్టీసీ బస్సును ఆపుతున్న పోలీసులు

'మహాలక్ష్మి'తో 40% పెరిగిన ప్రయాణికులు

- రోజువారీ సగటు సంఖ్య 28 లక్షల నుంచి 43 లక్షలకు..
- పెరిగిన వారి కోసం మరో 2,500 కొత్త బస్సులు అవసరం

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): ఆర్టీసీ బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన 'మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం' కార్యక్రమంతో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరుగుతున్నది. రోజు ప్రయాణించే వారి సంఖ్య 13 లక్షల మేర పెరిగింది. అందులోనూ 90 శాతం మంది మహిళలే కావడం గమనార్హం. ఈ రూపంలో ఆర్టీసీకి రోజువారీ ఆదాయం దాదాపు రూ.4.50 కోట్లు పెరిగినట్టు లెక్కలు చెప్తున్నాయి. మహిళా ప్రయాణికుల ఉచిత ప్రయాణానికి టికెట్ రేటును ప్రభుత్వం రీయింబర్స్ చేయనున్నందున ఆదాయం పెరుగుతున్నది. గతంలో సాధారణ రోజుల్లో ఆర్టీసీకి నిత్యం రూ.13 కోట్ల నుంచి రూ.14 కోట్ల వరకు ఆదాయం వస్తుండగా, ఇప్పుడది రూ.18.25 కోట్లకు చేరుతున్నది.

జీరో టికెట్ జారీతో తేలిన లెక్క

బస్సుల్లో సోమవారం రద్దీ అధికంగా ఉంటుంది. సాధారణ రోజుల్లో సగటున 28 లక్షల మంది ప్రయాణిస్తే, సోమవారాల్లో 34 లక్షల వరకు ఉంటుంది. మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభమయ్యాక, గత సోమవారం 51 లక్షల మంది ప్రయాణించినట్టు అధికారులు పేర్కొన్నారు. ఇప్పుడు జీరో టికెట్ల జారీ ప్రకారం ఈ నెల 16న రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో 43,12,033 మంది ప్రయాణించినట్టు తేలింది.

కొత్త బస్సులు కావాలి..

మహిళల సంఖ్య భారీగా పెరిగినందున బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. స్థలం లేక పురుషులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పరిస్థితి అదుపు తప్పకూడదంటే కనీసం 2,500 కొత్త బస్సులు సమకూర్చుకోవాల్సి ఉంటుందని అధికారులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్త బస్సులు సమకూర్చుకోవాలని ఆర్టీసీ భావిస్తున్నది.

ఇస్రోలో టెక్నికల్ అధికారిగా శ్రావణ్‌కుమార్

జగిత్యాల జిల్లా పోరుమల్ల యువకుడి ఘనత

మెట్‌పల్లి, డిసెంబర్ 19 : బీఎస్ఎన్ఎల్ మెట్‌పల్లిలో జేటీవోగా పని చేస్తున్న జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం పోరుమల్ల గ్రామానికి చెందిన పీ శ్రావణ్‌కుమార్ ఇస్రోలో టెక్నికల్ అధికారిగా ఉద్యోగం సాధించారు. శ్రావణ్‌కుమార్ పదోతరగతి వరకు పోరుమల్లలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివారు. ఏపీఆర్‌జేసీలో 11వ ర్యాంకుతో నిమ్మకూర్‌లో ఇంటర్ పూర్తి చేశారు. 2014లో హైదరాబాద్‌లోని వాసవి ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తి చేసిన 3, 4 నెలల వ్యవధిలోనే బీఎస్ఎన్ఎస్‌లో జేఈగా ఉద్యోగం సాధించారు. ఇస్రోలో తన సేవలు అందించాలనే లక్ష్యం పెట్టుకున్నారు. ఆ మేరకు బీఎస్ఎన్ఎల్‌లో డిపార్ట్‌మెంటల్ పోటీ పరీక్షల్లో ప్రతిభను చాటి జేటీవోగా ఎంపికయ్యారు. తాజాగా జాతీయ స్థాయిలో ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన పోటీ పరీక్షకు హాజరై సత్తా చాటారు. జాతీయ స్థాయిలో 12 పోస్టులకు వేలాది మంది పోటీ పడగా అందులో మొదటి ర్యాంకు సాధించి టెక్నికల్ అధికారిగా ఉద్యోగం సాధించారు. ఈ నెల 29న బెంగళూర్‌లోని ఇస్రో ప్రధాన కార్యాలయంలో ఉద్యోగంలో చేరనున్నట్టు శ్రావణ్‌కుమార్ తెలిపారు.

విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేనకు శుభాకాంక్షలు

హైదరాబాద్, డిసెంబర్ 19 (నమస్తే తెలంగాణ): పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి పొందిన ఐఏఎస్ అధికారి శ్రీదేవసేనకు మంగళవారం పలువురు విద్యాశాఖ అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. సైఫాబాద్‌లోని విద్